క్లుప్తంగా

పంచాంగ పుస్తకాల పంపిణీ



సంగివలస కొత్తమ్మ ఆలయంలో పంచాంగ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

తగరపువలస: సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర గంటల పంచాంగాలను ఆలయ సిబ్బంది భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. నగరానికి చెందిన శర్వాణి స్వీట్స్ యాజమాన్యం ఇటీవల వందలాది పంచాంగాలను ఆలయానికి అందించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది కోరాడ శ్రీను, తాటికొండ రాంబాబు, అర్చకులు నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణశర్మ, నాగేశ్వరరావు వాటిని భక్తులకు అందించారు.

పల్లపు ప్రాంతాలు జలమయం



ఆదర్శనగర్ రహదారిలో సర్వీస్ రోడ్డుపై మురుగు వ్యర్థాలు

తగరపువలస: భీమిలి మండలంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కారణంగా పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల ముందు మురుగుతో కూడిన వర్షం నీరు నిలిచిపోయింది. డ్రైనేజీల్లోని మురుగు వ్యర్థాలు రోడ్లపైకి చేరుకున్నాయి. ఎడతెరిపి లేకుండా రెండు గంటలపాటు కురిసిన వర్షంతో ఉగాది సంబరాలకు కొద్దిగా ఆటంకం కలిగింది. సాయంత్రం పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. వర్షం కురిసిన ప్రతీసారి ఆదర్శనగర్, సబ్బివానిపేట, ఉళ్లపేట, సంగివలస గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, చెరువు ముఖద్వారాలు అభివృద్ధి చేసి రోడ్లపై నీరు నిలిచిపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

హైవే సర్వీసు రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు

ఇబ్బందులకు గురవుతున్న వాహన చోదకులు



లొడగలవానిపాలెం వద్ద వెలగని విద్యుత్ దీపాలు

ఆనందపురం : మండల పరిధిలో జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించిన సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజల సౌకర్యార్థం సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. వాటికి గ్రామాల నుంచి వచ్చే రోడ్లను అనుసంధానించారు. అలాంటి చోట్ల గ్రామాల నుంచి వాహనాలు సర్వీసు రోడ్లోకి ప్రవేశించే సమయంలో ప్రమాదాలు సంభవించకుండా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సంబంధిత కాంట్రాక్టరు వాటి నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో వీధి లైట్లు ఎక్కడా సక్రమంగా వెలగడం లేదు. మండల పరిధిలో లొడగలవానిపాలెం, దుక్కవానిపాలెం, తర్లువాడ, గుడిలోవ, నీళ్ల కుండీలు జంక్షన్, శొంఠ్యాం, మామిడిలోవ, గండిగుండం తదితరచోట్ల గ్రామాల రోడ్లు సర్వీసు రోడ్డుకు కలిసే చోట వీధి దీపాలను ఇరు వైపులా ఏర్పాటు చేశారు. అయితే అవి కొన్ని ప్రాంతాల్లో వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ చిమ్మచీకట్లు కమ్ముకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు సక్రమంగా వెలిగేటట్టు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రుషికొండపై శ్రీవారి ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆలయాలకు ఉగాది శోభ

- ఉత్సాహంగా శ్రీశోభకృత్ సంవత్సరానికి స్వాగతం
- రుషికొండపై శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ

కొమ్మాది: తెలుగు నూతన సంవత్సరాది శ్రీశోభకృత్ నామ సంవత్సరానికి బుధవారం అందరూ ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఆలయాలన్నీ ఉగాది శోభను సంతరించుకున్నాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి, ప్రసాదం స్వీకరించారు. రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఆలయ ఏఈవో రమేష్, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరాజు శ్రీవారికి పట్టు వస్త్రాలు, ఆభరణాలు తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో గల ఉత్సవమూర్తులకు సమర్పించారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. వేకువజాము నుంచి రాత్రి వరకు శ్రీవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి భక్తులు బారులు తీరారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీవారి సేవకులు కోలాటం, శ్రీనివాసుని నామ సంకీర్త నిర్వహించారు.

పీఎం పాలెం: తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా బుధవారం పీఎం పాలెంలోని హిందూ దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఏడాది పొడవునా తమకు మంచి జరగాలని ప్రార్థిస్తూ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. పాత పీఎం పాలెంలో శోభకృత్‌నామ సంవత్సర పంచాంగం వినిపించారు. స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ రాశి ఫలాలు, నక్షత్ర బలాలు,



లక్ష్మీ నారాయణ స్వామికి సువర్ణ సంపంగెలతో పుష్పార్చన

ఆదాయ - వ్యయం, రాజపూజ్యం - అవమానం అడిగి తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని శిల్పారామంలో బుధవారం సాయంత్రం ఉత్సాహంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి ప్రధాన గేటు వద్ద షడ్రుచుల ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం నగరంలోని జ్యోష్ డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు కుశాల్, శిరీష్, స్వప్న, దీప్తి, హేమ హర్షిణి, స్రవంతి, యస్మిత కీర్తి తదితరులు పాల్గొనగా మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు.

పద్మనాభం: మండల ప్రజలు ఉగాది వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆరగించారు. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. రామాలయాలు, రచ్చబండల వద్ద పంచాంగం వినిపించారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధి 5, 6, 7, 8వ వార్డుల్లో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చంద్రంపాలెం, మానం ఆంజనేయులు నగర్, మధురవాడ టైలర్స్ కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృత, సుగంధ అభిషేకాలు నిర్వహించారు. చంద్రంపాలెం శ్రీలక్ష్మీ నరసింహ మహిళా కోలాట బృందం కళాకారులు సంతోషి గురువు ఆధ్వర్యంలో కోలాటం ఆడారు. అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అర్చకులు సత్య శ్రీనివాస శర్మ పంచాంగం చదివి వినిపించారు.

పలువురు ప్రముఖులకు సత్కారం

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో బుధవారం శ్రీ శుభబలరామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురికి ఉగాది పురస్కారాలు అందజేశారు. ముందుగా ఉగాది వేడుకలను సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ప్రసాదరావు పట్నాయక్ రాజీవ్‌గాంధీ మానవసేవ అవార్డు గ్రహీత కె.రవికుమార్, ఇంటర్నేషనల్ యునైటెడ్ అబ్దుల్ కలాం సొసైటీ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పాడ అప్పారావు, జాతీయ నంది అవార్డు గ్రహీత యేలూరి ధర్మావతి, ఇంటర్నేషనల్ వండర్ ఆఫ్ బుక్ అవార్డు గ్రహీత ఊహా మహంతి, ఓం సుఖీభవ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోరాడ ఆదినారాయణ, సంఘ సేవకుడు మీసాల రామునాయుడును సత్కరించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కె.శివ ప్రసాదరావు, జంగం జోషి, బండారు అనిల్ కుమార్, కాజ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ఉత్సవాలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి బుధవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు సుప్రభాత సేవ, ఆరాధన, అష్టలక్ష్మీ హోమం, 8.30 నుంచి విశేష సువర్ణ సంపంగెలతో పుష్పార్చన చేశారు. అనంతరం ఉగాది పచ్చడి ప్రసాదం అందజేశారు.



జానపద నృత్యం చేస్తున్న చిన్నారులు



మధురవాడ అష్ట లక్ష్మి ఆలయంలో పంచాంగం చదువుతున్న శ్రీనివాస శర్మ



ఊహను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వుడా హరిత గార్డెన్స్ నూతన కార్యవర్గం

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్ సమీపంలో గల వుడా హరిత గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది. ఇక్కడ అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వీఎమ్ఆర్‌డీఏ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఇక్కడి అపార్ట్‌మెంట్ల యజమానులు బుధవారం సమావేశమై వుడా హరిత గార్డెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎమ్.మాధవి రాణి, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్లుగా పి.బుల్లిబాబు,



నూతన కార్యవర్గ సభ్యులు

ఈఎస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.శామ్యూల్ తనూజ, ఆర్.జ్యోతి స్వరూప్, ఎస్.తులసి దేవి, వి.రమాదేవి, కోశాధికారిగా జి.ప్రదీప్, జాయింట్ ట్రెజరర్‌గా కేవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా డి.మోహన్ రావు, సంయుక్త కార్యదర్శిగా ఎన్.పుష్పలత, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

తగరపువలస: ఉగాది పర్వదినం సందర్భంగా భీమిలి నూకాలమ్మ ఆ లయ పరిసరాల్లో భక్తులకు సేవలు అందిస్తు న్న వంద మంది పారిశుధ్య కార్మికులు, ఆరోగ్య సిబ్బందికి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో బుధవారం ఆహార ప్యాకెట్లు అందించారు. మండలి విద్యార్థిని బెవర నిత్య శ్రీ ఆర్థిక సాయంతో వీటిని అందించారు. మండల అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం వృథా

- నేరెళ్లవలస సమీపంలో రూ.7 లక్షలతో పార్కు నిర్మాణం
- జనావాసాలకు దూరం కావడంతో వినియోగించని వైనం
- పాడైపోతున్న విలువైన వ్యాయామ పరికరాలు



మురుగునీరు చేరడంతో అధ్వానంగా ఉన్న పార్కు పరిసరాలు

భీమునిపట్నం: కొన్ని సమయాల్లో అధికారులు చేసే తప్పిదాల వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా పోతోంది. ఇందుకు నిదర్శనమే నేరెళ్లవలస కాలనీ సమీపంలో నిర్మించిన పార్కు. వివరాల్లోకి వెళ్తే... ఇక్కడి నేరెళ్లవలస కాలనీలోకి వెళ్లే మార్గానికి కొద్ది దూరంలో రోడ్డు పక్కన విశాలమైన స్థలం ఉండడంతో రూ.7లక్షల నిధులతో పార్కు నిర్మాణానికి అధికారులు నిర్ణయించారు. అందుకోసం స్థలం చదునుచేసి చుట్టూ ఇనుప కంచె వేశారు. ఇందులో వ్యాయామం చేసుకోవడానికి పలు పరికరాలు, పార్కులో నడవడానికి వాకింగ్



పార్కులో నిరుపయోగంగా ఉన్న విలువైన వ్యాయామ పరికరాలు

ట్రాక్ ఏర్పాటు చేశారు. అయితే ఈ పార్కు జనావాసాలకు దూరంగా ఉండడంతోపాటు శ్మశానానికి ఆనుకుని ఏర్పాటు చేయడంతో ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దాంతోపాటు దీనికి కొద్ది దూరంలో ఉన్న నివాసాల నుంచి వచ్చే మురుగునీరు వెళ్లడానికి కాలువలు సరిగ్గా లేకపోవడంతో పార్కులోకే ఆ నీరంతా వచ్చి మడుగులా మారింది. దీంతో ఈ ప్రాంతమంతా దుర్వాసనతో చిత్తడిగా ఉండడంతో వచ్చే ఒకరిద్దరు వాకర్స్ కూడా ఇక్కడకు రావడం మానేశారు. దీంతో పార్కులోని వ్యాయామ పరికరాలు పాడైపోతున్నాయి. మరోవైపు రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సేవించడంతోపాటు పరికరాలను పాడుచేయడంతో ఇప్పటికే కొన్ని విరిగిపోయాయి. ఇలాగే కొంతకాలం ఉంటే ఇవి పూర్తిగా విరిగిపోయి పనికి రాకుండాపోయే పరిస్థితి ఏర్పడనుంది. అసలు పార్కు ఎక్కడ ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందో, ఉపయోగకరంగా ఉంటుందోనన్న కనీస అవగాహన లేకుండా ఇలా



నడవడానికి వీలుగా లేని వాకింగ్ ట్రాక్

లక్షలాది రూపాయలు అధికారులు ఖర్చు చేసేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైపోతున్న విలువైన వ్యాయామ పరికరాలను అందరూ వినియోగించుకునే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం



నిరుపయోగంగా ఉన్న పార్కు విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటాం. వినియోగించక పాడైపోతున్న వ్యాయామ పరికరాలను బీచ్ పార్కు సమీపంలోగానీ, అవసరమైన ప్రాంతంలోగానీ ఏర్పాటు చేస్తాం. పార్కు ఆవరణలో మురుగునీరు చేరకుండా కాలువ సదుపాయం కల్పిస్తాము.

–బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి సత్యవెంకట హిమ బిందు

పద్మనాభం: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమ బిందు సూచించారు. మండలంలోని కురపల్లిలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, అశోక్ హీరావత్ సంయుక్తంగా మహిళా హక్కులు, చట్టాలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మహిళ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. గృహ హింస చట్టం 498/ఏను సరైన మార్గంలో అనుసరించాలని తెలిపారు. బాల్య వివాహ చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తున్నారని, ఇది చట్ట రీత్యా నేరమన్నారు. భర్త నుంచి కోర్టులో విడాకులు తీసుకున్న మహిళ తనతోపాటు పిల్లలకు మనోవర్తి పొందేందుకు చట్టం అవకాశం కల్పించిందన్నారు. అబార్షన్లు, భ్రూణ హత్యలు నేరమన్నారు. బాలికలను లైంగికంగా వేధించేవారికి ఫోక్సో చట్టంతో గుణపాఠం చెప్పాలని సూచించారు.

ఉచితంగా న్యాయ సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రారంభిస్తామని సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమ బిందు తెలిపారు. అవసరమైన వారు జిల్లా న్యాయ సేవ అథారిటీ, పారా



మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీబీఐ కోర్టు ప్రిన్సిపాల్ స్పెషల్ జడ్జి సత్య వెంకట హిమబిందు

లీగల్ వలంటీర్, న్యాయవాది ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. సమస్యలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. విద్య, ఆస్తి, రాజకీయ రంగాల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. లింగ వివక్ష చూపకుండా ఆడ పిల్లలను తప్పనిసరిగా చదివించాలన్నారు. డొమస్టిక్ వయలెన్స్ యాక్ట్‌ను అత్యవసర పరిస్థితుల్లో వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 250 మంది పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పౌరాణిక రంగస్థల నటుడు ఉప్పాడ అప్పారావును సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.సునీల్ కుమార్, రాజీవ్ గాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, భీమిలి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎస్.జనార్దనరావు, ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ డి.పుల్లారావు, ఎస్.శ్రీలక్ష్మి, జి.మైథిలి, ఊహా మహంతి, అశోక్ హీరావత్, ఎస్.మహేష్ పాల్గొన్నారు.

హైస్కూల్ స్థలం పరిరక్షణకు పోరాటం



హైస్కూల్ స్థలం కాపాడుకోవాలని గోడపై రాతలు



సాక్షిలో ఇటీవల ప్రచురితమైన 'హైస్కూల్ స్థలం ధారాదత్తం' కథనం క్లిప్పింగ్‌తో పూర్వ విద్యార్థులు తయారుచేసిన పోస్టర్లు

- పాత ప్రహరీ తొలగించి... అక్కడే గోడ నిర్మించాలని చిట్టివలస పూర్వ విద్యార్థుల డిమాండ్
- అందరి మద్దతు కోసం పోస్టర్ల ముద్రణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని అంగుళం కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేమని... ప్రస్తుతం ఉన్న పాత ప్రహరీని తొలగించి అదే స్థలంలో కొత్తగా గోడ నిర్మించాలని హైస్కూల్ పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. 'హైస్కూల్ స్థలం ధారాదత్తం' శీర్షికతో ఈ నెల 21న సాక్షిలో ప్రచురించిన కథనానికి పూర్వ విద్యార్థులు, జ్యూట్‌మిల్లు కార్మికులు స్పందించారు. బుధవారం పలువురు హైస్కూల్‌ను సందర్శించారు. కార్మికుల కష్టంతో కొనుగోలు చేసిన స్థలాన్ని స్కూల్ అవసరాలకే వినియోగించాలని.., ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్, జీవీఎంసీ, జిల్లా పరిషత్ అధికారులు, డీఈవో, స్కూల్ పేరెంట్స్ కమిటీకి ఉందన్నారు. త్వరలో పూర్వ విద్యార్థులు, స్థానిక పెద్దలు, జ్యూట్ కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి హైస్కూల్ పరిరక్షణకు సంఘాన్ని ఎన్నుకుంటామన్నారు. ఈ మేరకు మద్దతు కూడగట్టేందుకు గోడలపై నినాదాలు, పేపర్ క్లిప్పింగ్‌లను పోస్టర్లు వేయించారు. పోరాటంలో భాగంగా పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడును పూర్వ విద్యార్థులంతా బుధవారం కలిశారు. లక్షలాది రూపాయల విలువైన హైస్కూల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు అండగా నిలవాలని కోరారు. తగరపువలస, చిట్టివలస క్రీడాకారులకు పెద్దదిక్కుగా ఉన్న హైస్కూల్ ఆటస్థలాన్ని రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రైవేటు వ్యక్తుల కోసం కొంత స్థలం వదిలేసి ప్రహరీ నిర్మిస్తే భవిష్యత్‌లో విద్యార్థులు, క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పూడుకుపోయిన అసంపూర్తి డ్రైనేజీలు



చిట్టివలస కళ్లాల్లో స్థానికులు మట్టితో పూడ్చేసిన డ్రైనేజీలు



సీసీ రోడ్డు మధ్య ఏర్పడిన గుంత

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస కళ్లాల్లో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీలు ఉపయోగం లేకపోవడంతో స్థానికులు మట్టితో పూడ్చేశారు. ఇక్కడి కళ్లాల్లో 30 కుటుంబాల వరకు రెల్లి సామాజికవర్గం వారు ఏళ్ల తరబడి మౌలిక వసతులకు దూరంగా జీవిస్తున్నారు. వీరి గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేకపోవడంతో పలుమార్లు భీమిలి జోనల్ కార్యాలయం చుట్టూ తిరిగేవారు. అప్పట్లో భీమిలి నుంచి ప్రాతినిధ్యం వహించిన గంటా శ్రీనివాసరావు వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయగా కంటి తుడుపు చర్యగా వంద మీటర్ల మేరకు సీసీ రోడ్లు, అసంపూర్తిగా డ్రైనేజీలు నిర్మించారు. ఈ డ్రైన్ల నుంచి మురుగునీరు వెళ్లే కనెక్టివిటీ లేకపోవడంతో అక్కడే నిలిచిపోయేది. దీంతో విసుగెత్తిన స్థానికులు మట్టితో డ్రైనేజీలను పూడ్చివేశారు. తూతూ మంత్రంగా నిర్మించిన సీసీరోడ్లు రెండేళ్లకే నామరూపాల్లేకుండా పోయాయి.

వైఎస్సార్‌సీపీ రాకతో కళ్లాలకు మేలు

చిట్టివలస పట్టణానికి శివారులో ఉండే ఈ కళ్లాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఎక్కువగా మేలు జరిగింది. గత ప్రభుత్వ హయాంలో కళ్లాలకు చెందిన ప్రజలు రేషన్ సరకుల కోసం 3 కిలోమీటర్ల దూరంలో చిల్లపేటకు, సామాజిక పెన్షన్‌కు ఒక కిలోమీటరు దూరంలో ఉండే చిట్టివలసకు రోజుల తరబడి తిరిగేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతీనెలా ఒకటో తేదీనే ఇంటి గుమ్మం ముందుకు పింఛన్ నగదు, అయిదు రోజులలోపే రేషన్ పంపిణీ చేసే వాహనం ద్వారా సరకులు అందుతున్నాయి. వీధి దీపాలు, ట్యాంకర్ల ద్వారా తాగునీరు రోజూ సరఫరా జరుగుతుంది. చిట్టివలస నుంచి కళ్లాలకు రహదారి నిర్మాణం కోసం ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే కూడా చేపట్టారు. నిర్మాణం పూర్తయితే స్థానికుల కష్టాలు తీరుతాయి.

దోమలు కుట్టికుట్టి చంపుతున్నాయ్!

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో దోమలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాటి నుంచి ఉపశమనం పొందడానికి ఫ్యాన్లు, కాయిల్స్, రీఫిల్స్ వినియోగించినా కుట్టికుట్టి చంపుతున్నాయి. దీంతో ప్రజలకు ఒంటి మీద దోమకాట్లతో దద్దుర్లు ఏర్పడుతున్నాయి. దోమల నియంత్రణకు జీవీఎంసీ సిబ్బంది అప్పుడప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దోమల నివారణకు పారిశుధ్య సిబ్బంది తరచూ అవగాహన కలిగిస్తున్నా ఆచరణలో నిర్మూలన కనిపించడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు కాయిల్స్, రీఫిల్స్‌పై ఖర్చు పెట్టలేకపోవడం లేదా అవగాహన లేకపోవడంతో దోమకాట్ల వల్ల వ్యాధులకు గురవుతున్నారు. కొద్దిమందికి మాత్రమే దోమతెరలు అందుబాటులో ఉండటంతో వీటి బెడద నుంచి తప్పించుకోగలుగుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది పారిశుధ్యంపై మరింత దృష్టి సారించి దోమల బెడద పూర్తిగా తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.

ముత్యాల తలంబ్రాల వితరణ



ఏఈవోకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న శివశంకర్‌రాజు

సింహాచలం: వచ్చే నెల 2న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన విజయలక్ష్మి డైమండ్స్ అధినేత శివశంకర్‌రాజు రూ.90వేలు విలువ చేసే ముత్యాల తలంబ్రాలు వితరణగా ఇచ్చారు. సింహగిరిపై ఆలయంలో ఏఈవో నరసింహరాజుకు వాటిని అందజేశారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, రామలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. అనంతరం ఆ ఆన్‌లైన్ వివరాలు 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలని ఆలయ అధికారులు కోరారు.